www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

గ్రామ గ్రామానికి రాజ్యాంగం ఐ ఎల్ పి ఎ లక్ష్యం



3 లో..

అంబేద్కర్ రాజ్యాంగమే దేశానికి దిక్సూచి..
సమానత్వానికి అసలైన ఆయుధం



4 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 299, శుక్రవారం 27-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

లక్ష ఉద్యోగాల లక్ష్యం పూర్తి చేస్తాం

- ఏడాదిలో మరో 25 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- ఇప్పటికే 75 వేల నియామకాలు..
- అచ్చంపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం
- కొత్తగా 4.89 లక్షల మందికి పింఛన్ల పంపిణీకి శ్రీకారం



అచ్చంపేట, నవంబర్ 26 :

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు మరో శుభవార్త అందించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. వచ్చే ఏడాది కాలంలో మరో 25 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి నియామకాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 75 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 25 వేల నియామకాలతో లక్ష ఉద్యోగాల లక్ష్యాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి మంత్రులు, ప్రజాప్రతినిధులు, స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో

మిగతా 2 లో..

మహిళలు పంచాయతీ నుంచి పార్లమెంట్‌కు ఎదగాలి

- మహిళలకు ఆర్థికంగా, హార్దికంగా అండగా ఉంటానని హామీ
- పనితోపాటు పదవుల్లోనూ సమాన ప్రాధాన్యత కల్పించాలని పిలుపు
- ప్రతి ఇంట్లో మతగ్రంథంతోపాటు రాజ్యాంగం ఉండాలని సూచించన కవిత
- తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగానికి 'తెలంగాణ రుద్రమసేన'గా నామకరణం



హైదరాబాద్, నవంబర్ 26

మహిళలు పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు రాజకీయంగా ఎదిగేందుకు తాను ఆర్థికంగా, హార్దికంగా అండగా ఉంటానని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. జనాభాలో సగం ఉన్న మహిళలకు అవకాశాల్లోనూ సగం వాటా దక్కాలని కోరారు. మహిళలకు పనిలోనే కాకుండా పదవుల్లోనూ ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మహిళల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాంగం కల్పించిన అవకాశాలపై గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహిళలు రాజ్యాంగం' సదస్సులో ఆమె మాట్లాడారు.

రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజే మహిళలకు నిజమైన పండుగ రోజని కవిత అభివర్ణించారు. వేల ఏళ్లుగా మహిళలను వస్తువులుగా, ఆస్తులుగా మాత్రమే చూసిన సమాజంలో వారిని సంపూర్ణ మనుషులుగా గుర్తించింది రాజ్యాంగమేనని అన్నారు. మహిళలకు ఓటు హక్కుతోపాటు సమానత్వం, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కులను రాజ్యాంగం కల్పించిందని వివరించారు. దేశంలో వేలాది మంది మహిళలు ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్లుగా ఎదగడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులే పునాదిగా నిలిచాయని చెప్పారు. అందుకే ప్రతి ఇంట్లో మతగ్రంథంతోపాటు రాజ్యాంగం కూడా ఉండాలని, ప్రతి మహిళా దాన్ని తప్పనిసరిగా చదివి తన హక్కులను తెలుసుకోవాలని సూచించారు.

మహిళలపై వివక్ష ఇప్పటికీ అనేక రూపాల్లో కొనసాగుతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లికి ముందు తండ్రి, అన్న నిర్ణయాలపై, పెళ్లి తర్వాత భర్త, అత్తింటి కుటుంబ నిర్ణయాలపై మహిళల జీవితం ఆధారపడే వరకు సమాన పనికి సమాన వేతనం అందడం లేదని పేర్కొన్నారు. కులం, మతం, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా వివిధ రూపాల్లో మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారని చెప్పారు.

మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపుల పట్ల సమాజం మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరారు. తన ప్రేమను అంగీకరించలేదనే కారణంతో ఓ విద్యార్థిని చెప్పుతో కొట్టిన ఘటనను ప్రస్తావిస్తూ, ఒక అమ్మాయి 'నో' చెప్పినంత మాత్రాన ఆమెపై దాడి చేసే

మిగతా 2 లో..



ప్రపంచస్థాయి సరఫరా వ్యవస్థల నిర్మాణానికి ప్రాధాన్యం

- హైదరాబాద్‌లో సీఐఐ తెలంగాణ రక్షణ, అంతరిక్ష సదస్సు
- 'తెలంగాణ నుంచి ప్రపంచ మార్కెట్ల వైపు' ఇతివృత్తంతో సమావేశం
- ప్రారంభోపన్యాసం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- పరిశ్రమల ప్రతినిధులు, నిపుణుల భాగస్వామ్యంతో చర్చలు

హైదరాబాద్, నవంబర్ 26 :

తెలంగాణలో రక్షణ, అంతరిక్ష రంగాలకు సంబంధించిన పరిశ్రమల అభివృద్ధి, ప్రపంచస్థాయి సరఫరా వ్యవస్థల నిర్మాణంపై దృష్టి సారిస్తూ హైదరాబాద్‌లో గురువారం సీఐఐ తెలంగాణ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కాన్క్లేవ్-2026 నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. రక్షణ, అంతరిక్ష రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలు, పరిశ్రమల విస్తరణకు అవసరమైన అంశాలపై ఈ సమావేశం వేదికగా చర్చలు జరిగాయి.

"తెలంగాణ నుంచి ప్రపంచ మార్కెట్ల వైపు - హైదరాబాద్‌లో రక్షణ మరియు అంతరిక్ష రంగాల సరఫరా వ్యవస్థల నిర్మాణం" అనే ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహించారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, రక్షణ, అంతరిక్ష పరిశ్రమలకు అవసరమైన ఉత్పత్తులు, సేవలను అందించే సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడం ఈ సమావేశ ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. స్థానిక పరిశ్రమలకు ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం కల్పించే అవకాశాలపైనా సదస్సులో దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యుడు డాక్టర్ జి. సతీష్ రెడ్డి పాల్గొన్నారు. రక్షణ, అంతరిక్ష రంగాలకు సంబంధించిన విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల భాగస్వామ్యం వంటి అంశాలపై ఆయన అనుభవం ఈ సదస్సుకు ప్రాధాన్యం తీసుకొచ్చింది. ఈ రంగాల్లో దేశీయ సామర్థ్యాలను పెంపొందించుకోవడం, ప్రపంచ స్థాయి అవసరాలకు అనుగుణంగా తయారీ వ్యవస్థలను తీర్చిదిద్దుకోవడం వంటి అంశాలు సమావేశ ఇతివృత్తంలో కీలకంగా నిలిచాయి. సీఐఐ తెలంగాణ చైర్మన్ ఎం. గౌతమ్ రెడ్డి కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు. పరిశ్రమల రంగానికి చెందిన ప్రతినిధులు, రక్షణ, అంతరిక్ష రంగాల నిపుణులు ఒకే వేదికపైకి రావడం ద్వారా పరస్పర ఆలోచనలు, అనుభవాల మార్పిడికి అవకాశం ఏర్పడింది. తెలంగాణలో ఇప్పటికే ఉన్న పారిశ్రామిక సామర్థ్యాలను ఈ రంగాల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే మార్గాలపై చర్చించేందుకు ఈ సమావేశం దోహదపడింది. రక్షణ, అంతరిక్ష రంగాలు సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యతా ప్రమాణాలు, పరిశోధన, తయారీ సామర్థ్యాలతో ముడిపడి ఉన్న కీలక రంగాలు కావడంతో వాటి సరఫరా వ్యవస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని తెలంగాణ పరిశ్రమలు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలను అందిపుచ్చుకునే అంశంపై ఈ సదస్సు దృష్టి సారించింది.

పెట్టుబడుల సదస్సుతో యువతకు ఉపాధి అవకాశాలు

- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్
- ప్రజాభవన్ వార్‌రూమ్‌లో ఏర్పాట్లపై భట్టి విక్రమార్క సమీక్ష
- పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు మెరుగైన సదుపాయాలు
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచన



హైదరాబాద్, నవంబర్ 26 : తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు.

మిగతా 2 లో..

పార్టీ మార్పు ప్రచారంలో వాస్తవం లేదు: వివేక్ వెంకటస్వామి

- కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యం
- కొత్త ఇన్‌చార్జి సందీప్ కుమార్‌తో రాష్ట్ర రాజకీయాలపై చర్చ
- గిగ్ కార్మికుల సంక్షేమానికి దేశంలోనే ఆదర్శంగా చట్టం



2 లో..

ప్యాకెట్లపై ఎర్రటి హెచ్చరికలు తప్పనిసరి!

- అధిక చక్కెర, కొవ్వు, ఉప్పు ఉన్న ఆహారాలపై ప్రత్యేక గుర్తులు
- వినియోగదారుల ఆరోగ్య రక్షణకు సుప్రీంకోర్టు ఆదేశాలు
- ప్రతి పోషకానికి ప్రత్యేకంగా ఎర్రటి షడ్భుజి గుర్తు
- పాఠశాల స్థాయి నుంచే పోషకాహారంపై అవగాహనకు సూచనలు

న్యూఢిల్లీ, నవంబర్ 26 :

ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల వినియోగంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యం కల్పించే దిశగా సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అధిక మోతాదులో కొవ్వు, చక్కెర, ఉప్పు కలిగిన ఆహార పదార్థాల ప్యాకెట్లపై వినియోగదారులకు వెంటనే కనిపించేలా స్పష్టమైన హెచ్చరికలు ముద్రించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)ను ఆదేశించింది. ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో వాటిలో ఉండే అనారోగ్యకర పోషకాల గురించి ప్రజలకు ముందుగానే సమాచారం అందించడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశం. జస్టిస్ జె.బి. పార్థివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మార్గదర్శకాలను సూచించింది.

మిగతా లో..



భద్రాద్రి న్యూస్
www.bhadradrinews.com
తెలుగు దినపత్రిక
Follow : @bhadradrinews
శుక్రవారం
27 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

లక్ష ఉద్యోగాల లక్ష్యం పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులకు కొత్తగా 4.89 లక్షల పింఛన్ల పంపిణీకి కూడా శ్రీకారం చుట్టారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.450 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

తెలంగాణ ఉద్యమానికి నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన లక్ష్యాలని గుర్తుచేసిన ముఖ్యమంత్రి.. పాలమూరు ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసి కృష్ణా జలాలను ఈ ప్రాంత పొలాలకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అచ్చంపేట ఎత్తిపోతల, డిండి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. అనాడు రూ.10 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. ఇవి పూర్తయి ఉంటే కృష్ణా జలాల విషయంలో ఇబ్బందులు ఉండేవి కావని, రోజుకు మూడు టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉండేదని చెప్పారు. తద్వారా లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డగా ఈ ప్రాంత పొలాలను కృష్ణా నీటితో తడపాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

అచ్చంపేట, నల్లమల ప్రాంతంతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తాను ఈ గడ్డపై పుట్టిన బిడ్డనని, ఈ ప్రాంతానికి చేయాల్సిన అభివృద్ధి పనులు చేపట్టి, సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. రాణి అచ్చమాంబ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తితో పాలన సాగిస్తున్నామని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యమిచ్చి దేశాభివృద్ధికి కృషి చేసిన తీరును వివరించారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, విధ్వంసం, అప్పులతో సతమతమైన తెలంగాణను అభివృద్ధి దిశగా నడిపించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని అన్నారు. గత 34 నెలలుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటాన్ని గుర్తించి తమ ప్రభుత్వం ఆ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో కులగణన జరగకపోవడంతో వివిధ కులాల జనాభా, వారి జీవన ప్రమాణాలపై సరైన గణాంకాలు అందుబాటులో లేవని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా కులగణన చేపట్టి, కులాలవారీగా జనాభా, సామాజిక పరిస్థితులను అంచనా వేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని అన్నారు. రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ కుటుంబ బీమా, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. నిరుపేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రూ.79 వేల కోట్ల రుణ అనుసంధానం, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పథకాలను ప్రస్తావించారు. కొత్తగా మంజూరు చేసిన 4.89 లక్షల పింఛన్లతో కలిపి రాష్ట్రంలో మొత్తం 6,00,858 పింఛన్లు అందిస్తున్నామని వెల్లడించారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీ, కులం, మతం అనే తేడాలు లేకుండా అర్హులందరికీ సమానంగా ప్రయోజనాలు అందిస్తున్నామని, పేదలను ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

పెట్టుబడుల సదస్సుతో యువతకు ఉపాధి అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న ఈ అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం ప్రజాభవన్‌లోని వార్‌రూమ్‌లో అధికారులతో కలిసి పరిశీలించారు. సదస్సుకు దేశ, విదేశాల నుంచి హాజరయ్యే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతలను వారికి పరిచయం చేయడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారులు, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలో సాదర స్వాగతం పలికేందుకు చేపట్టాల్సిన చర్యలపై భట్టి విక్రమార్క వివరాలు తెలుసుకున్నారు. అతిథులకు మెరుగైన వసతి, రవాణా, ఇతర అవసరమైన సదుపాయాలు కల్పించడంతోపాటు సదస్సు నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.

పెట్టుబడుల సాధనను కేవలం రాష్ట్ర ఆర్థిక వృద్ధికి సంబంధించిన అంశంగా మాత్రమే చూడకూడదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే ప్రతి పెట్టుబడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేలా ఉండాలని ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించారు. పరిశ్రమల స్థాపన ద్వారా స్థానికంగా ఉపాధి పెరగడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. పెట్టుబడుల ద్వారా సృష్టించే సంపద, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులను సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు వివరించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సమర్థంగా పరిచయం చేయడంతోపాటు పారిశ్రామికవేత్తలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు తెలిపారు. సదస్సులో పాల్గొనే ప్రతినిధులకు రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, అభివృద్ధి ప్రణాళికలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా సంబంధిత శాఖలు సిద్ధం కావాలని సూచించారు. సదస్సు విజయవంతం కావడానికి అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పెట్టుబడుల ఆకర్షణతోపాటు ఉపాధి కల్పన, ప్రజల జీవన ప్రమాణాల పెంపు, అన్ని వర్గాల అభ్యున్నతికి ఈ సదస్సు దోహదపడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమగ్ర అభివృద్ధి దిశగా తెలంగాణను ముందుకు తీసుకెళ్లేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను కీలక వేదికగా మలచాలని ప్రభుత్వం భావిస్తోంది.

మహిళలు పంచాయతీ నుంచి పార్లమెంట్‌కు ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

హక్కు ఎవరికీ లేదని అన్నారు. మరో ఘటనలో డిగ్రీ విద్యార్థిని వసతి గృహంలోని మరుగుదొడ్డిలో ప్రసవించిందన్న వార్తను ప్రస్తావిస్తూ, విద్యార్థినుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తారు. మహిళల హక్కుల కోసం గతంలో పోరాడిన సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్‌లను గుర్తుచేస్తూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న మహిళల చరిత్రకు తగిన గుర్తింపు రాలేదన్నారు. మహిళల చరిత్రను పురుషులు రాస్తారని ఎదురుచూడకుండా మహిళలే తమ పోరాటాలను, విజయాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ, మైనార్టీ మహిళలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని అభిప్రాయపడ్డారు. తాను మహిళల కోసం రాజకీయ పార్టీని కాలక్షేపం కోసం స్థాపించలేదని, వారికి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చానని కవిత తెలిపారు. మహిళలకు ఇల్లు, భూమి, బ్యాంకు ఖాతా, ఉద్యోగాలు వంటి ఆర్థిక స్వావలంబనకు అవసరమైన అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. మహిళలు రాజకీయాల్లోకి వస్తే ఎదురయ్యే వ్యక్తిగత విమర్శలకు భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగానికి 'తెలంగాణ రుద్రమ సేన'గా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని, నియోజకవర్గాల బాధ్యతలు చేపట్టే నాయకులు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- **రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి**
- **విద్యార్థులకు రాజ్యాంగం, పౌరుల హక్కులు, బాధ్యతలపై అవగాహన**



హుజూరాబాద్,నవంబర్ 26

భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి విలువలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున, కరీంనగర్ జిల్లా కన్వీనర్ బండ నరేందర్ అన్నారు.

నవంబర్ 26 భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ - కరీంనగర్ జిల్లా టీం ఆధ్వర్యంలో హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని జెడ్.పి.ఎస్.హెచ్.పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి రాజ్యాంగ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

అనంతరం విద్యార్థులకు భారత రాజ్యాంగ ప్రాముఖ్యత, పౌరుల హక్కులు, బాధ్యతలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులను తెలుసుకోవడం, వాటిని సద్వినియోగం చేసుకోవడం, సమాజంలో ఇతరుల హక్కులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. రాజ్యాంగ విలువలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలి

ఈ సందర్భంగా తిరగమల్ల నాగార్జున, బండ నరేందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులను కల్పించిందని, ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే పునాది అని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని, ముఖ్యంగా విద్యార్థులు చిన్ననాటి నుంచే రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

విద్యార్థులు కేవలం విద్యాభ్యాసానికే పరిమితం కాకుండా దేశ చరిత్ర, రాజ్యాంగం, పౌరుల హక్కులు, విధుల గురించి కూడా తెలుసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలంటే న్యాయం, సమానత్వం, సోదరభావం వంటి విలువలను జీవితంలో పాటించాలని తెలిపారు.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి తన అభిప్రాయాలను వ్యక్తపరిచే స్వేచ్ఛను, సమానత్వపు హక్కులను కల్పించిందని పేర్కొన్నారు. ఈ హక్కులను గౌరవించడంతో పాటు దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు.

రాజ్యాంగ దినోత్సవం కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా రాజ్యాంగంలోని ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాల్సిన రోజని తెలిపారు. విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో చైతన్యవంతమైన, బాధ్యతాయుతమైన పౌర సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు.

ప్రజాస్వామ్యంలో సమాచార హక్కు కీలకం

ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాచార హక్కు చట్టం - 2005 ప్రజలకు ఎంతో శక్తివంతమైన సాధనమని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ నిర్ణయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చట్టబద్ధంగా సమాచారాన్ని పొందే హక్కు ప్రతి పౌరుడికి ఉందని వివరించారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకొని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.

సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారి కుటుంబాలు, గ్రామాల్లో కూడా చైతన్యం పెరుగుతుందని తెలిపారు. రాజ్యాంగం, సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం

విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను తెలియజేయడం, పౌరుల హక్కులు, బాధ్యతలపై చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కమిటీ సభ్యులు తెలిపారు.

సమాజంలో ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, చట్టాలను పాటిస్తూ, ఇతరుల హక్కులను పరిరక్షించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి విలువలను అలవర్చుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, కమిటీ సభ్యులకు నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కరీంనగర్ జిల్లా కన్వీనర్ బండ నరేందర్, హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున, హుజూరాబాద్ మండల కన్వీనర్ పిట్ట శ్రీనివాస్, రంగాపూర్ గ్రామ ప్రధాన కార్యదర్శి బొడ్డు కృష్ణ, రాంపూర్ గ్రామ అధ్యక్షుడు ఎర్ర రాజు, రాజపల్లె గ్రామ అధ్యక్షుడు రవీందర్, గోడిశాల గ్రామ ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవిద్దాం - హక్కులను తెలుసుకుందాం - ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం!

రాజ్యాంగం మన గౌరవం.. హక్కులు మన బలం.. ప్రజాస్వామ్యం మన బాధ్యత.. అనే సందేశంతో చెల్పూర్ గ్రామంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

పార్టీ మార్పు ప్రచారంలో వాస్తవం లేదు: వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్, నవంబర్ 26

: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఖండించారు. గాంధీభవన్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఇన్‌చార్జి బి.ఎం. సందీప్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, రాబోయే పార్టీ కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన పార్టీ పటిష్ఠతకు కట్టుబడి పనిచేస్తానని వెల్లడించారు. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రుల సదస్సులో తెలంగాణలో అమలు చేస్తున్న కార్మిక సంక్షేమ కార్యక్రమాలను వివరించినట్లు వివేక్ వెంకటస్వామి తెలిపారు. కనీస వేతనాల అమలు, గిగ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయని చెప్పారు. అనంతరం ఢిల్లీలో జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమైనట్లు వెల్లడించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని వివరించారు. గిగ్ కార్మికుల సంక్షేమం కోసం దేశానికే ఆదర్శంగా నిలిచేలా చట్టాన్ని తీసుకొచ్చామని మంత్రి పేర్కొన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సమస్య పరిష్కారానికి వేతనాల సవరణ చేపట్టినట్లు తెలిపారు. మరోవైపు యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కేంద్రాల నెట్‌వర్క్‌ను రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని వివేక్ వెంకటస్వామి తీవ్రంగా ఖండించారు. సిద్ధిపేటలో పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేశానని తెలిపారు. పార్టీలో తనకు ఎవరితోనూ వ్యక్తిగత విభేదాలు లేవని, ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే పార్టీ వేదికపైనే చర్చించుకోవాలని అన్నారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి తన బాధ్యతలను నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి శ్రీధర్‌బాబుకు సంబంధించిన అంశంపై ప్రశ్నించగా, ప్రజా సమస్యలపై తన అభిప్రాయాన్ని వెల్లడించే సామర్థ్యం వంశీకృష్ణకు ఉందని, ఎలా ముందుకు వెళ్లాలో ఆయనే నిర్ణయించుకుంటారని చెప్పారు. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోలేదని పేర్కొన్నారు.

యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడమే లక్ష్యం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



- **కిషన్ రెడ్డి ప్రారంభించిన హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్ కార్యక్రమం**
- **రెండో రోజు ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లో కొనసాగిన అవగాహన కార్యక్రమం**
- **విద్యార్థులు, యువతకు క్రీడల ప్రాధాన్యత వివరించిన పుల్లెల గోపీచంద్**
- **మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా భాగస్వాములు కావాలని పిలుపు**

హైదరాబాద్, నవంబర్ 26

: యువతను మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉంచి, ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. హైదరాబాద్‌లోని ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవాలని సందేశమిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా యువతలో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావడంపై దృష్టి సారించారు. యువత భవిష్యత్తును కాపాడటం, వారిని చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తుచేస్తున్నారు. ప్రభుత్వంతో పాటు కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు కూడా ఈ దిశగా తమ వంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని కార్యక్రమం ముందుకు తీసుకెళ్తోంది.

రెండో రోజు కార్యక్రమంలో భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రధాన జాతీయ కోచ్, ప్రముఖ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ పాల్గొని విద్యార్థులు, యువతకు ప్రేరణనిచ్చారు. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, శారీరక వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "క్రీడలకు అవును చెప్పండి.. మాదకద్రవ్యాలకు కాదు చెప్పండి", "వ్యాయామానికి అవును చెప్పండి.. మాదకద్రవ్యాలకు కాదు చెప్పండి" అనే నినాదాలతో యువతలో చైతన్యం కల్పించారు.

క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మ విశ్వాసం పెంపొందించడానికి కూడా ఉపయోగపడతాయి. యువత తమ శక్తి సామర్థ్యాలను సానుకూల మార్గాల్లో వినియోగించుకోవాలని, వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని కార్యక్రమం ద్వారా సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లను చిన్న వయసు నుంచే అలవరుచుకోవడం ద్వారా వ్యక్తిగత జీవితంతో పాటు సమాజానికి కూడా మేలు జరుగుతుందని సందేశమిచ్చారు. మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తుపై ప్రభావం చూపకుండా అడ్డుకోవడానికి సమష్టి కృషి అవసరం. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో అవగాహన కల్పిస్తూ, యువతకు సరైన మార్గనిర్దేశం చేయాలని కార్యక్రమం పిలుపునిచ్చింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన ఈ నషా ముక్త్ భారత్ ప్రచారంలో భాగంగా రెండో రోజు పుల్లెల గోపీచంద్ పాల్గొని క్రీడలు, వ్యాయామం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని యువతకు పిలుపునిచ్చారు.

గ్రామ గ్రామానికి రాజ్యాంగం ఐ ఎల్ పి ఎ లక్ష్యం

వరంగల్ కోర్టులో రాజ్యాంగ దినోత్సవం



వరంగల్ ,నవంబరు 26 (భద్రాద్రిన్యూస్):-

స్వేచ్ఛ, సమానత్వం, సమన్యాయానికి ప్రతీక అయిన రాజ్యాంగాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లి రాజ్యాంగ విలువల బోధన చేయడమే ప్రధాన లక్ష్యంగా ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తన కార్యక్రమాలు చేస్తుందని ఐ ఎల్ పి ఎ వరంగల్ జిల్లా అధ్యక్షులు విలాసాగరం సురేందర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వరంగల్ కోర్టు అంబేద్కర్ హాల్ లో ఐ ఎల్ పి ఎ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గురిమిల్ల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని అంబెద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి మాట్లాడారు. భారతదేశంలో రాజ్యాంగ అమలులోకి వచ్చి 76 ఏండ్లు గడిచినా నేటికి మెజార్టీ ప్రజలకు రాజ్యాంగ విలువలు, హక్కులు, రాజ్యం, ఓటు విలువ, ఎన్నికలు, ప్రజాస్వామ్యం గురించి తెలియకపోవడం బాధాకరమని, పాలకవర్గ పార్టీలు ఉద్దేశ పూర్వకంగానే రాజ్యాంగ విలువలను ప్రజలకు తెలియకుండా పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. రాజ్యాంగాన్ని సమర్పించే సందర్భంగా అంబేద్కర్ మాట్లాడుతూ చరిత్ర మళ్లీ పునరావృతమై దేశ మూలవాసి ప్రజలు మళ్లీ దోపిడీ వంచనకు గురవుతారా? కులాలు, మతాల రూపంలో ఇప్పటికే ఉన్న పాత శత్రువులతో పాటు పరస్పర విరుద్ధమైన రాజకీయ సిద్ధాంతాలు కలిగిన అనేక రాజకీయ పార్టీలు మనకు శత్రువులుగా ఏర్పడబోతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారని, ఆ మహానీయుడు ఆందోళన చెందినట్లుగానే ప్రజల కోసం వ్రాసిన రాజ్యాంగం పాలక వర్గాలకు మాత్రమే ఉపయోగపడుతుందని, ప్రజలను అణచివేసే చట్టాలను తయారు. చేయడానికి రాజ్యాంగాన్ని వాడుతూ ప్రజలను తీవ్రంగా అణచివేస్తున్నారని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని విస్తరించి స్వేచ్ఛ, సమానత్వాన్ని పెంచాల్సిన పాలకులు కుటిలత్వాన్ని, స్వార్థాన్ని పెంచి మత ఘర్షణలను, జాతి వివక్షతను పెంచి విచ్ఛిన్నకర పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఇంతటి భయంకరమైన స్థితిలో అణగారిన వర్గాల నుండి ఎదిగిన న్యాయవాదులు రాజ్యాంగ విలువలను, హక్కులను ప్రతి గ్రామానికి తీసుకెళ్లి సమసమాజ స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ సిద్ధాంత పునాదితో నల్ల కోట్లతో నీలి విప్లవం విజయంతం చేయడం కోసం ఐ ఎల్ పి ఎ దేశ వ్యాప్తంగా ఉద్యమం కొనసాగిస్తుందని, ఆ ఉద్యమంలో ప్రగతిశీల భావాలున్న న్యాయవాదులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిర్ర సాంబశివరాజు, పరికరాల రఘుపతి, ఐ ఎల్ పి ఎ వరంగల్ హనుమకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శులు గురిమిల్ల రాజు, చింత సాంబశివరావు, ఐ ఎల్ పి ఎ వరంగల్ బార్ ప్రధాన కార్యదర్శి అనుమాండ్ల రాజ్ కుమార్, ఐ ఎల్ పి ఎ హనుమకొండ బార్ అధ్యక్షులు పూసపల్లి శ్రీనివాస్, ఐ ఎల్ పి ఎ జిల్లా నాయకులు పోతన సంధ్యారాణి, బండారు కవిత, జన్ను ప్రభాకర్, కట్కూరి సూరయ్య, జాషువ, కోటేశ్వరరావు, నదునూరి చంద్రమౌళి, అనిల్, మైదం చంద్రకాంత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చాపలమడుగు రాకేష్ బాబు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 26 (భద్రాద్రిన్యూస్):

భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చాపలమడుగు రాకేష్ బాబు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జటోత్ వెంకన్న నాయక్ హాజరయ్యారు ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ జటోత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వం కల్పించిందని పేర్కొన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషి భారతదేశ చరిత్రలో చిరస్మరణీయమని కొనియాడారు రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు, రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను కూడా బాధ్యతగా పాటించాలని అన్నారు. సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఎస్సీ మోర్చా జిల్లా పదాధికారులు, కార్యవర్గ సభ్యులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుల సంఘం పేరుతో అక్రమాలు.. తప్పుడు పత్రాలతో కోర్టులకే బురిడీ..

- పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో బాధితుడు తాళ్లూరి వీరభద్రయ్య ఆవేదన

- అధికారుల ఉదాసీనతపై మండిపాటు..

భూమిని కాపాడాలని విన్నపం

పాల్వంచ, నవంబర్ 26, (భద్రాద్రి న్యూస్):

కొంతమంది స్వార్థపరులు కుల సంఘాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని, తప్పుడు ధ్రువపత్రాలతో ఉన్నతాధికారులను, కోర్టులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని పాల్వంచ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 79 వారసత్వ హక్కుదారుడు తాళ్లూరి వీరభద్రయ్య తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం పాల్వంచ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ?రికార్డుల ట్యాంపరింగ్.. భూ ఆక్రమణ యత్నం తనకు వారసత్వంగా సర్వే నంబర్ 79లో ఒక ఎకరం, సర్వే నంబర్ 39లో 2 ఎకరాల 11 కుంటల భూమి సంక్రమించిందని వీరభద్రయ్య తెలిపారు. అయితే తమ బంధువులైన కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు పత్రాలు సృష్టించి తమ విలువైన భూమిని ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని ఆరోపించారు.?దేవభక్తుని లక్ష్మయ్య, వెంకయ్య, వేదవతి, వెంకటేశ్వరరావు అనే వ్యక్తులు రెవెన్యూ రికార్డులను అక్రమంగా మార్చి, కొనుగోలుదారులుగా, అనుభవదారులుగా చలామణి అవుతున్నారని తెలిపారు.?కొనుగోలుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, పైగా వెంకటేశ్వరరావు తండ్రి లక్ష్మయ్య పాల్వంచను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నట్లుగా కోర్టులను మభ్యపెట్టారని మండిపడ్డారు.?సాదాబైనామా క్రమబద్ధీకరణ ఆధారాలు లేకపోయినా దొంగ పాస్‌బుక్కులు, పొంతన లేని రికార్డులు సృష్టించారని స్పష్టం చేశారు.

15 ఏళ్లుగా మడతపేచీ.. అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరి

2009లో అప్పటి ఆర్డీవోకు ఫిర్యాదు చేసినా 15 ఏళ్లపాటు రికార్డులను బహిర్గతం చేయలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో లోకాయుక్తను ఆశ్రయించగా రికార్డులు ట్యాంపరింగ్ అయినట్లు నివేదికల్లో తేలిందని అన్నారు.?హైకోర్టు సూచనలతో 2024లో సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశామని, ఇందులో సివిల్ వివాదం ఏమీ లేదని, రికార్డులు మార్చినందుకు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించినా స్పందన లేదన్నారు.రికార్డుల ట్యాంపరింగ్‌పై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేసినప్పటికీ తదుపరి చర్యలు శూన్యమని వాపోయారు. ఇదిలా ఉండగా, ఆక్రమార్కులు తమ భూమిని



వారి స్థలంలో కలుపుకుని ప్రహరీ గోడ సైతం నిర్మించారని వీరభద్రయ్య తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా స్పందించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ భూమికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

కోదాడ నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) :





కోదాడలోని ఎస్సార్ ప్రైమ్ స్కూల్లో జోనల్ ఇన్చార్జి స్నేహలత ఆధ్వర్యంలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జోనల్ ఇన్చార్జి స్నేహలత మాట్లాడుతూ భారత రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. భారత రాజ్యాంగం మన దేశ ప్రజాస్వామ్యానికి దిక్సూచి అని, ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ,న్యాయం కల్పిస్తూ దేశ సమగ్రతకు బలమైన పునాదిగా భారత రాజ్యాంగం నిలుస్తుందని అన్నారు. ప్రిన్సిపాల్ పుల్లయ్య మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు తెలుసుకోవడంతో పాటుగా మన బాధ్యతలను కూడా తెలుసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే మాక్ అసెంబ్లీ నిర్వహించి, దాని ప్రత్యేకతను సోషల్ ఉపాధ్యాయురాలు జ్యోతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువల పరిరక్షణే అందరి బాధ్యత

- ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



కామేపల్లి, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కామేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో అధికారులు రాజ్యాంగ పీఠికను చదివించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజలందరికీ న్యాయం,స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందించే లక్ష్యంతో రూపొందిన రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ మహిళలు, అణగారిన వర్గాల హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ వీవీఎస్ శాస్త్రి, సూపరింటెండెంట్ నరేందర్, యూడీసీ పాపారావు, కంప్యూటర్ ఆపరేటర్లు నరేష్, వీరభద్రం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లో-వోల్టేజీ కష్టాలకు చెక్

- రాయిగూడెంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- నాణ్యమైన విద్యుత్ అందించడమే మా లక్ష్యం: ఏడిఈ యాదగిరి

కామేపల్లి, నవంబరు 26 (భద్రాద్రిన్యూస్): మండలంలోని రుక్మీ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని రాయిగూడెం గ్రామస్థులకు లో-వోల్టేజీ కష్టాలు తీరాయి. గ్రామంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించింది. తక్కువ వోల్టేజీ కారణంగా ఇంట్లో ఉపకరణాలు తిరగక, చిరువ్యాపారాలు, రోజువారీ పనులకు ఆటంకం కలుగుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ జి.రమాదేవి,రవి నాయక్ పాలకవర్గ సభ్యులు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేశారు.ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్,ఉప సర్పంచ్,పరమ శెట్టి సాంబయ్య వార్డు సభ్యుల సమక్షంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది లైన్ ఇన్స్పెక్టర్ మధు. హట్కర్ బద్రు. గాంధీ.లైన్మెన్ బి.కుమార్.సురేష్ గ్రామ స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ యువజన మండల ఉపాధ్యక్షులుగా సతీష్ ఎన్నిక

- సతీష్‌ని సన్మానిస్తున్న

రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్ రెడ్డి

కామేపల్లి, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్):





కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యువజన ఉపాధ్యక్షులుగా మండల పరిధిలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన చల్లా సతీష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాత లింగాల గ్రామంలో తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్ రెడ్డి సతీష్ ను శాలువతో ఘనంగా సత్కరించారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సతీష్ విలేకరులతో మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ అభివృద్ధి కోసం తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

పండితాపురం ప్రైమరీ స్కూల్లో రాజ్యాంగ దినోత్సవం



కామేపల్లి నవంబర్ 26 (భద్రాద్రిన్యూస్): పండితాపురం ప్రైమరీ స్కూల్లో గురువారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను చదివించారు. న్యాయం,స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లక్ష్యంగా రూపొందిన రాజ్యాంగ విలువలను కాపాడుతూ, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని కోరారు. మహిళలు, అణగారిన వర్గాల హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిస్తూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదూరి ప్రసాద్, పారా లీగల్ వాలంటీర్ ఆదూరి సత్యవతి, హెచ్ఎం మాధవి, ఉపాధ్యాయుడు వెంకట్,పీఈటీ నీరుడు మేరీ తదితరులు పాల్గొన్నారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
శుక్రవారం
27 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

ఏపీ సీఎం చంద్రబాబు దంపతులకు కొత్తగూడెంలో ఘన స్వాగతం



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతులకు గురువారం ఘన స్వాగతం లభించింది. హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, రామదాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ముఖ్యమంత్రి దంపతులు మంత్రి తుమ్మల, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నవభారత్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగమే దేశానికి దిక్సూచి

- దాని ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది

- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేటర్లు పద్మ, సుప్రియ



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) : భారత రాజ్యాంగమే మన దేశానికి దిక్సూచి అని, దాని ఔన్నత్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని 15, 16వ డివిజన్ల కార్పొరేటర్లు మునిగడప పద్మ, ఆకునూరి సుప్రియ అన్నారు. రామవరంలో జై భీమ్ కమిటీ ఆధ్వర్యంలో, తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ కౌన్సిలర్ తోగరు రాజశేఖర్ అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. డా. బి.ఆర్. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే అతి సామాన్యుడు కూడా ఉన్నత స్థానంలోకి ఎదగగలుగుతున్నాడని, దేశంలో మతానికి ఒక గ్రంథం ఉన్నా, దేశం మొత్తానికి ఉన్న ఏకైక గ్రంథం రాజ్యాంగమేనని అన్నారు. ప్రధాని సైతం రాజ్యాంగానికి లోబడే పాలించాలని, సవరణల పేరుతో రాజ్యాంగ మూలాలకు తూట్లు పొడిచే ప్రయత్నాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఐక్యంగా రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన అవకాశంతో ప్రజాప్రతినిధులుగా అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా పనిచేస్తామని అంబేద్కర్ సాక్షిగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ నాయకులు ఆకునూరి కనకరాజు, న్యాయవాది మునిగడప వెంకటేశ్వర్లు, సావటి స్వామి, దొబ్బేటి గురుమూర్తి, కొరిమి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీని ఢీ కొట్టిన లారీ మహిళ మృతి

- సోమవారం గ్రామానికి చెందిన

శ్రీ రామినేని ఫణి కళ అనే 38 సంవత్సరాల మహిళ మృతి





వైరా, నవంబర్ 26, (భద్రాద్రి న్యూస్) : వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ సోమవారం గ్రామానికి చెందిన శ్రీ రామినేని ఫణి కళ 38 సంవత్సరాల మహిళ సోమవారం గ్రామము నుండి గురువారం స్కూటీపై ఖమ్మం వెళ్తుండగా స్కూటీని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి గతంలో పెళ్లి అయిపోయి ఒక కుమార్తె, భర్తతో విడాకులు తీసుకోవడంతో ఒంటరిగా ఉంటూ ఖమ్మంలోని ఓ ప్రైవేట్ హాస్పటల్లో పనిచేస్తుంది. రోజు లాగానే ఈరోజు కూడా ఉదయం ఇంటి నుంచి బయలుదేరి ఖమ్మం వెళ్తుండగా మార్గ మధ్యంలో మృత్యువు లారీ రూపంలో వెంటాడింది. ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో అదుపు తప్పి స్కూటీతో సహా రోడ్డుపై పడిపోవటంతో తలకు తీవ్ర గాయాలు కావటంతో ప్రమాదం జరిగిన సంఘటనలోనే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ప్రమాదం జరిగిన సంఘటన స్థలానికి చేరుకున్న వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాస్వామ్య ఆదర్శాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

- జడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి, డిప్యూటీ సీఈఓ బి.అప్పారావు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బందితో కలిసి భారత రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులతో పాటు పౌరుల బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. రాజ్యాంగ విలువలు, ఆదర్శాలను గౌరవిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్లు వివివికే ప్రసాద్, బి.రమేశ్, జడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ రాజ్యాంగమే దేశానికి దిక్సూచి.. సమానత్వానికి అసలైన ఆయుధం

- మనువాద అసమానతలకు చరమగీతం పాడాలి..

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వమే రాజ్యాంగ లక్ష్యం

: బీఎస్పీ వరంగల్ చీఫ్ జోన్ ఇన్‌చార్జి దయానందరావు





చర్ల, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్): భారతదేశ ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి, సమానత్వానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే దిక్సూచి అని బహుజన్ సమాజ్ పార్టీ వరంగల్ చీఫ్ జోన్ ఇన్‌చార్జి దాగిళ్ల దయానందరావు అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చర్ల మండల కేంద్రంలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సదస్సులో దయానందరావు ముఖ్య ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత కుటుంబంలో జన్మించిన అంబేద్కర్ చిన్ననాటి నుంచే ఎన్నో కులవివక్షలు, అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ వాటిని అధిగమించి అపారమైన జ్ఞానాన్ని సంపాదించారని కొనియాడారు. భారతదేశ చరిత్ర, సామాజిక వ్యవస్థపై లోతైన అధ్యయనం చేసిన ఆయన సమాజంలో నెలకొన్న కుల అసమానతలు, అంటరానితనం, వివక్షను రూపుమాపేందుకు జీవితాంతం పోరాడారని వివరించారు.

కుల వివక్షకు కాదు.. మనిషి గౌరవానికే రాజ్యాంగం

మనువాద భావజాలం పేరుతో సమాజంలో కొనసాగుతున్న అసమానతలు మానవీయ విలువలకు విరుద్ధమని దయానందరావు పేర్కొన్నారు. మనుషుల మధ్య కులం ఆధారంగా ఉన్నత, నిమ్న భేదాలు సృష్టించి ఒక వర్గాన్ని మరో వర్గం కంటే తక్కువగా చూసే వ్యవస్థకు వ్యతిరేకంగా అనేకమంది మహనీయులు పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ అంబేద్కర్ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలతో కూడిన రాజ్యాంగాన్ని దేశానికి అందించారని తెలిపారు. అనేక అవమానాలు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ అంబేద్కర్ తన లక్ష్యం నుంచి వెనక్కి తగ్గలేదని, అణగారిన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో కృషి చేశారని అన్నారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ ప్రజాస్వామ్య హక్కులు, సమానత్వపు విలువలను అందించిందని వివరించారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కుతో పాటు రాజ్యాంగం ద్వారా కల్పించిన ప్రాథమిక హక్కులు ప్రజాస్వామ్యానికి పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

రాజ్యాంగం కేవలం పాలనా వ్యవస్థకు సంబంధించిన చట్టపుస్తకం మాత్రమే కాదని, మానవ గౌరవం, సామాజిక న్యాయం, సమాన అవకాశాలకు మార్గదర్శకమని దయానందరావు అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి మనిషిని గౌరవించే సమాజం ఏర్పడినప్పుడే అంబేద్కర్ ఆశించిన సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పీడిత, అణగారిన వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలు, ప్రజాస్వామ్యవాదులు సైతం రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రాజ్యాంగాన్ని కన్నతల్లిలా భావించి కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జిలు తాండ్ర వెంకటేశ్వర్లు, తడికల శివకుమార్, జిల్లా అధ్యక్షులు కోళ్లపూడి ప్రవీణ్, జిల్లా ఉపాధ్యక్షులు యాసం సిద్ధార్థ పూలే, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసుపాక కృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వీసంపల్లి నర్సింహారావు, కోశాధికారి సరోజ, భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షులు చెన్నం మోహన్ రావు, కారం జనార్దన్, సొంది వీర్రాజు, చర్ల మండల అధ్యక్షులు పాయల మోహన్ రావు, మంగతాయి, ప్రమీల, కాక నర్సయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.





రాజ్యాంగ పరిరక్షణకు ప్రజాస్వామ్యవాదులంతా ఐక్యం కావాలి

-- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) : భారత రాజ్యాంగ పరిరక్షణకు ప్రజాస్వామ్యవాదులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అపార మేధస్సుతో, అనేక దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశానికి ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని అందించారని కొనియాడారు. 1949 నవంబర్ 26న ఆమోదించబడి, 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన రాజ్యాంగం దేశ ప్రజలకు ప్రాణవాయువులాంటిదని పేర్కొన్నారు. అయితే, నేడు కేంద్రంలోని పాలకులు రాజ్యాం గానికి తూట్లు పొడుస్తూ, మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగ పీఠికలోని 'సోషలిస్టు', 'లౌకిక' పదాలను తొలగించి, దేశాన్ని ఒక మత రాజ్యంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ పెట్టుబడిదారీ విధానాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వేల ఏళ్ల భారత చరిత్ర, సంస్కృతుల సారంతో రూపుదిద్దుకున్న రాజ్యాంగాన్ని ఎవరూ విచ్ఛిన్నం చేయలేరని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య, లౌకిక విలువల పరిరక్షణ కోసం సీపీఐ దేశవ్యాప్త పోరాటాలకు పిలుపునిచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, ఎస్ కె ఫహీమ్, నేరెళ్ల రమేష్, కొమారి హన్మంతరావు, పాపారావు, వర్మ అజిత్, గుర్రం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



దళిత సంఘాల ఆధ్వర్యంలో– కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- రాజ్యాంగ రక్షణ కు సైనికులుగా పనిచేయాలి,

అదే అంబేడ్కర్ కు నిజమైన నివాళి

-- దళిత సంఘాల పిలుపు



కొత్తగూడెం అర్బన్, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో సంజీవన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారత రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చేసిన విశేష కృషి, ఆయన సాగించిన సుదీర్ఘ సామాజిక పోరాటాన్ని నాయకులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదించిందని, అందుకే ప్రతి సంవత్సరం నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. 2015 సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం నవంబర్ 26ను అధికారికంగా రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహిస్తోంది. రాజ్యాంగ సభలో వివిధ అంశాలపై జరిగిన చర్చలు, ప్రజాస్వామ్య విలువలు, ప్రాథమిక హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం వంటి అంశాల రూపకల్పనలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ముఖ్యంగా శతాబ్దాలుగా సామాజిక వివక్ష, అంటరానితనం, అణచివేతకు గురైన బలహీన వర్గాలు, దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలకు సమాన హక్కులు, గౌరవప్రదమైన జీవనం, విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగం ఒక బలమైన పునాదిగా నిలిచిందని వివరించారు.అదేవిధంగా సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలలో ప్రధాన భూమిక పోషిస్తూ సామాజిక సమానత్వాన్ని నిర్మించడానికి అంబేద్కర్ లక్షణాలు నెరవేర్చడానికి విద్యావంతుడు మేధావులు చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ కేవలం రాజ్యాంగ రూపకర్తగానే కాకుండా, సామాజిక సమానత్వం, విద్య, స్వేచ్ఛ, హక్కులు, ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని అన్నారు. ఆయన ఆశయాలను కేవలం జయంతి, వర్ధంతి, రాజ్యాంగ దినోత్సవ వేడుకలకే పరిమితం చేయకుండా, ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైరా నియోజకవర్గ శాసనసభ్యులు రాందాస్ నాయక్, కోనేరు చిన్ని, సలిగంటి శ్రీను, దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కూసపాటి శ్రీనివాస్, మద్దెల శివకుమార్, మంద హనుమంతు, అంతోటి పౌల్ రాజ్, కార్పొరేటర్ దాసరి శ్రీను, బొమ్మెర శ్రీనివాస్, బీసీ నాయకులు అంకినీడు ప్రసాద్, మోడెం మోహన్ రావు, సుందర్ రావు, మహిళ నాయకురాలు కనుకుంట్ల నిర్మల, చర్మకారుల సంఘం అనుమల వీరయ్య, వేలేటి వెంకటేశ్వర్లు. తదితర కార్యవర్గం పాల్గొని విజయవంతం చేశారు.

ప్రతీ ఒక్కరూ రాజ్యాంగాన్ని చదవాలి

- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా
రాజ్యాంగ పుస్తకాల పంపిణీ
-- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) :
ప్రతీ ఒక్కరూ రాజ్యాంగాన్ని ఖచ్చితంగా చదవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు. 77వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని గాజులరాజం బస్తీలో గల సురక్ష ఓకేషనల్ కళాశాలలో, భారత రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగం అమలుకు ముందు తరతరాలుగా విద్యకు, సంపదకు, అధికారానికి దూరమైన బహుజన వర్గాలకు 26 నవంబర్ 1949 భారత రాజ్యాంగం ఆమోదంతో విముక్తి కలిగిందని 26 జనవరి 1950 న పూర్తిస్థాయిలో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రాథమిక హక్కులు కలిగాయని అన్నిటికంటే ముఖ్యంగా ఓటు హక్కు ప్రధానమైనదని ఓటు హక్కు ద్వారా అణగారిన వర్గాల ప్రజలు అధికారాన్ని చేజిక్కించుకోవచ్చు అని, తద్వారా చట్టసభలలో మనకు అనుకూలంగా చట్టాలను తయారు చేసుకోవచ్చని అన్నారు. ప్రజలకు అత్యున్నతమైన విద్యను,వైద్యాన్ని ఉచితంగా అందించవచ్చని అన్నారు. ఈ దేశంలోని ప్రతీ ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని చదవాల్సిన అవసరం ఉందని అంతేకాకుండా తెలియని వారికి తెలియజేయాల్సిన బాధ్యత ఉందని, ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రాజ్యాంగం పట్ల అవగాహన కలిగి ఉంటే పాలకులు మనలను పాలిస్తున్న విధానం రాజ్యాంగబద్ధంగా ఉన్నదా? లేదా? అనే విషయాన్ని ప్రజలు గ్రహించవచ్చని, మనకు జరిగే అన్యాయాల పట్ల పోరాడవచ్చని అన్నారు.కనుక అందరూ రాజ్యాంగాన్ని



చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, వినయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్యాకెట్లపై ఎర్రటి హెచ్చరికలు తప్పనిసరి!



(మొదటి పేజీ తరువాయి)

కొత్త నిబంధనల ప్రకారం ప్రతి ప్యాకెట్ ముందు భాగంలో ఎర్రటి షడ్భుజి ఆకారంలో హెచ్చరిక గుర్తులను ముద్రించాల్సి ఉంటుంది. అధిక కొవ్వు, అధిక చక్కెర, అధిక ఉప్పు అనే మూడు అంశాలకు కలిపి ఒకే గుర్తును ఉపయోగించకుండా, ఒక్కో పోషకానికి ఒక్కో ప్రత్యేక గుర్తును ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. దీనివల్ల ఒక ఆహార పదార్థంలో ఏ పోషకం అధికంగా ఉందో వినియోగదారులు సులభంగా గుర్తించగలుగుతారు. ఈ హెచ్చరికలు ప్యాకెట్ ముందు భాగంలో సుమారు 4 నుంచి 5 శాతం స్థలాన్ని ఆక్రమించేలా ఉండాలని, సాధారణంగా షాపింగ్ చేసే సమయంలోనూ సులభంగా చదవగలిగేంత పెద్ద అక్షరాలతో ముద్రించాలని సూచించింది.
'3ఎస్ అండ్ అవర్ హెల్త్ సొసైటీ' అనే సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఆహార పదార్థాల్లో పోషకాల పరిమాణాన్ని అంచనా వేసే విషయంలోనూ స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశించింది. కేవలం తయారీ సమయంలో అదనంగా కలిపిన చక్కెర, కొవ్వులనే పరిగణనలోకి తీసుకోకుండా, ఆహార పదార్థంలో సహజంగా ఉన్న వాటితో సహా మొత్తం చక్కెరలు, సంతృప్త కొవ్వుల పరిమాణాన్ని ఆధారంగా చేసుకొని హెచ్చరికల పరిమితులను నిర్ణయించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐని ఆదేశించింది. దీనివల్ల ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థలు తమ ఉత్పత్తుల్లోని పోషకాల వివరాలను మరింత బాధ్యతాయుతంగా వెల్లడించాల్సి ఉంటుంది.
ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై హెచ్చరికలు ముద్రించడంతోపాటు చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాల్సిన అవసరాన్ని కూడా సుప్రీం కోర్టు ప్రస్తావించింది. పాఠశాల విద్యార్థులకు పోషకాహారం, సమతుల ఆహారం, అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించేలా పాఠ్య ప్రణాళికలో మార్పులు తీసుకురావాలని సూచించింది. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులు స్వయంగా పాల్గొనే ప్రాక్టికల్ కార్యక్రమాలను కూడా నిర్వహించాలని ప్రభుత్వానికి తెలిపింది. చిన్నతనం నుంచే ఆహార పదార్థాలపై ఉన్న సమాచారాన్ని చదివి, వాటి పోషక విలువలను అర్థం చేసుకునే అలవాటు ఏర్పడితే భవిష్యత్తులో ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది పడుతుందని ఈ సూచనల ఉద్దేశం.
కొత్త నిబంధనల ముసాయిదాను రూపొందించేందుకు సుమారు నాలుగు నెలలు, వాటిని అమలు చేసేందుకు ఆహార పరిశ్రమకు 365 రోజుల సమయం ఇస్తామని ఎఫ్ఎస్ఎస్ఏఐ కోర్టుకు ప్రతిపాదించింది. ఈ గడువు సహేతుకంగా ఉందని పేర్కొన్న ధర్మాసనం, నిర్ణయించిన కాలపరిమితిని కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువును పొడిగించడానికి వీల్లేదని, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మార్పులు అమల్లోకి వస్తే ఆహార ప్యాకెట్లపై పోషక వివరాలను పరిశీలించి కొనుగోలు చేసే అవకాశం వినియోగదారులకు మరింత పెరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు, యువతలో పెరుగుతున్న అనారోగ్యకర ఆహారపు అలవాట్లను తగ్గించేందుకు హెచ్చరికల లేబులింగ్, పాఠశాల స్థాయి అవగాహన కార్యక్రమాలు ఎంతవరకు దోహదపడతాయన్నది కీలకంగా మారనుంది.

ఎర్రగుంట లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- మండల విద్యాశాఖాధికారి
అధికారి ఉండేటి ఆనందకుమార్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం, ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాదిరి రాజ్యాంగ పరిషత్ సమావేశాల చర్చలను ప్రదర్శించారు. ఆనాటి రాజ్యాంగ సభ్యుల వేషధారణలో విద్యార్థులు పాల్గొని, వారు ఆనాడు మాట్లాడిన మాటలను మాట్లాడుతూ కొన్ని రాజ్యాంగ సన్నివేశాలను కళ్ళకు కట్టినట్లు చూపడం జరిగింది. మండల విద్యాశాఖాధికారి మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉండేటి ఆనంద కుమార్ నేత్రుత్వంలో పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపధ్యాయులు గంటాడి సుశీల, మొత్కూరి పద్మ ఈ మాదిరి రాజ్యాంగ సమావేశాలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖధికారి ఉండేటి ఆనంద కుమార్ మాట్లాడుతూ... ఇటువంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరగడమే కాకుండా, సబ్జెక్టు పైన అవగాహనా



పెంపందుతుందని తెలియజేసారు. పాల్గొన్న అందరూ హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషలలో రాజ్యాంగ పీఠికా ప్రతిజ్ఞ చేశారు. తదుపరి విద్యార్థులకు పోస్టర్ తయారీ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ సున్నం నాగభూషణం, ఉపసర్పంచ్ వేముల నరేష్, పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ సీత, గ్రామ పెద్దలు వేముల రమణ, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శంకర్ మహదేవన్, సునంద రెడ్డి, రాజ్యలక్ష్మి, బివేంకటేశ్వర రావు, వసంత, సుశీల, పద్మ, శిరీష,



శ్రీనివాస రావు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- **మద్దిమడుగులో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన**
- **రూ.38 కోట్లతో ఆలయం, విగ్రహ నిర్మాణ పనులు**
- **ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం కేటాయింపు**
- **డిండి ప్రాజెక్టు నుంచి నీరిచ్చే బాధ్యత ప్రభుత్వానిదే :సీఎం రేవంత్**

నాగర్‌కర్నూల్, నవంబర్ 26
: రాష్ట్రంలోని బంజారాలు, ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్న సంకల్పంతోనే సంక్షేమ పథకాల్లో గిరిజన వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మద్దిమడుగులో రూ.38 కోట్లతో నిర్మించనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం, విగ్రహ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మద్దిమడుగుకు చేరుకున్న ముఖ్యమంత్రి తొలుత శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొత్తం రూ.71 కోట్లతో చేపట్టనున్న మూడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం, విగ్రహ నిర్మాణంతోపాటు శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో రూ.15 కోట్లతో నిర్మించనున్న హరిత హోటల్ భవనానికి, రూ.18 కోట్లతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో దాదాపు 45 శాతం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం అందిస్తున్నామని, వారిలో లంబాడ, ఆదివాసీ కుటుంబాలు అధికంగా లబ్ధి పొందుతున్నాయని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాల వెనుక గిరిజన, ఆదివాసీ వర్గాల అభివృద్ధి లక్ష్యం ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయా వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి దేశ సేవలో గొప్పగా రాణించాలన్న ఉద్దేశంతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. లంబాడీల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప ఆదర్శమూర్తి అని కొనియాడారు. శాంతియుత జీవనం, హింసకు దూరంగా ఉండటం, మాంసాహారం, మద్యానికి దూరంగా జీవించడం, పేదలకు సేవ చేయడం వంటి విలువలను ఆయన బోధించారని గుర్తుచేశారు. సమాజానికి ఆదర్శంగా నిలవాలని చెప్పిన సేవాలాల్ బోధనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. లంబాడీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ఉద్దేశంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1976లో లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎస్టీ రిజర్వేషన్ల ద్వారా గిరిజనులు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు పొందుతూ ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. భూమిలేని, వలసలు వెళ్లే గిరిజన కుటుంబాలకు అసైన్మెంట్, పోడు భూముల పట్టాలు అందించారని, ఇందిరా గాంధీ హయాంలో గిరిజనులకు 10 నుంచి 12 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తనది కొండారెడ్డిపల్లి అని, తాను అచ్చంపేట ప్రాంతానికి చెందిన నల్లమల బిడ్డనని చెప్పుకోవడం గర్వంగా ఉంటుందని అన్నారు. ఈ ప్రాంత ప్రజల కష్టపడే తత్వం, పోరాట పటిమ, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే స్వభావం తనకు స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు.మద్దిమడుగులో 16 ఎకరాల్లో సంత్ సేవాలాల్ ఆలయాన్ని నిర్మిస్తున్నామని, మరో నాలుగు ఎకరాలు సేకరించి అద్భుతమైన ఆలయంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అచ్చంపేట ప్రాంతంలో బ్రిడ్జి, లిఫ్ట్ పనులతోపాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయిస్తామని తెలిపారు. డిండి ప్రాజెక్టు నుంచి ఈ ప్రాంతానికి నీరు అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

విధులకు గైర్హాజరైతే కుటుంబానికే కాదు.. సంస్థ మనుగడకూ నష్టం

- కార్మికుల గైర్హాజరుపై కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించిన జీఎం వెంకటరమణ

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) : సింగరేణి సంస్థలో కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని, వాటికి పరిష్కార మార్గాలు చూపించాలనే ఉద్దేశంతో కొత్తగూడెం ఏరియా యాజమాన్యం ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాలకు చెందిన విధులకు సక్రమంగా హాజరుకాని కార్మికులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్.వెంకటరమణ ఆదేశాల మేరకు గురువారం రుద్రంపూర్‌లోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. 2026 జనవరి నుంచి అక్టోబర్ వరకు భూగర్భ గనుల్లో 80 మస్టర్లు, ఉపరితల విభాగాల్లో 120 మస్టర్లు లేదా అంతకంటే తక్కువ పని చేసిన ఉద్యోగులను గుర్తించి, మొత్తం 155 మంది ఉద్యోగులను కౌన్సిలింగ్‌కు ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా జీఎం సిహెచ్. వెంకటరమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో ఉద్యోగుల సంక్షేమానికి యాజమాన్యం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, విధులకు గైర్హాజరవుతున్న కార్మికుల పట్ల కఠినంగా వ్యవహరించడం కంటే ముందుగా వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలనే సదుద్దేశంతోనే ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. బయటి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే కనీసం వారి సమస్యలు, గైర్హాజరుకు గల కారణాలు తెలుసుకునే అవకాశం కూడా ఉండదని, కానీ సింగరేణి సంస్థలో మాత్రం కార్మికుల కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరుకాకపోయినప్పటికీ వారి సంక్షేమ పథకాలను యాజమాన్యం నిలిపివేయడం లేదని స్పష్టం చేశారు. ఉద్యోగులు విధులకు గైర్హాజరవుతున్నప్పటికీ వారికి కేటాయించిన క్వార్టర్లు, విద్యుత్, మంచినీటి సదుపాయాలు, గ్యాస్ సబ్సిడీ, వైద్య సదుపాయాలు తదితర సంక్షేమ సౌకర్యాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమంలో ఎక్కడా కోత విధించకుండా సంస్థ తన బాధ్యతను నిర్వర్తిస్తోందని వివరించారు. బయటి ప్రపంచంలో ఉద్యోగాల కోసం ఎంత తీవ్రమైన పోటీ ఉందో ప్రతి ఒక్కరూ ఒకసారి గమనించాలని జీఎం సూచించారు. సంస్థ రికార్డుల్లో ఉద్యోగుల సంఖ్య ఉన్నప్పటికీ, వాస్తవంగా విధులకు హాజరై ఉత్పత్తిలో భాగస్వాములవుతున్న వారి సంఖ్య తగ్గడం ఆందోళనకరమని అన్నారు. దీనివల్ల సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇదే పరిస్థితి భవిష్యత్తులోనూ కొనసాగితే సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతను గుర్తించి క్రమం తప్పకుండా విధులకు హాజరై సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఒక ఉద్యోగి ఉద్యోగం కోల్పోతే దానిపై ఆధారపడిన మొత్తం కుటుంబం ఇబ్బందుల్లో పడుతుందని, అలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదనే ఉద్దేశంతోనే అధికారులు తమ విలువైన సమయాన్ని వెచ్చించి ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారని జీఎం పేర్కొన్నారు. ఉద్యోగులు ఎందుకు విధులకు రావడం లేదు? వారి వ్యక్తిగత, కుటుంబ, ఆరోగ్య సమస్యలు ఏమిటి? అనే విషయాలను తెలుసుకొని, సాధ్యమైనంత వరకు పరిష్కార మార్గాలు చూపించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని



వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలింగ్‌కు హాజరైన ప్రతి ఉద్యోగిని వ్యక్తిగతంగా వారి గైర్హాజరుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అనారోగ్య కారణాలతో విధులకు హాజరుకాని ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితులను సంబంధిత వైద్యాధికారులతో సమీక్షించాలని మెడికల్ విభాగానికి సూచించారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు తరచూ విధులకు గైర్హాజరవడం వల్ల కలిగే ఆర్థిక, వ్యక్తిగత నష్టాలతో పాటు సంస్థ ఉత్పత్తిపై పడే ప్రభావాన్ని వివరించారు. ఇకపై క్రమం తప్పకుండా విధులకు హాజరై సింగరేణి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జీఎంతో పాటు కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ జె. గట్టయ్య, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, ఎస్ఓ టు జీఎం ఎం. గోవిందరావు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి. లలిత, డీవైపీఎం హరీష్ గోవర్ధన్, సీనియర్ పీఓలు మజ్జి మురళి, ఎం.డి. మతిన్ హుస్సేన్, బి. రాము, సంక్షేమ అధికారులు షేక్ షకీల్, విక్టర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యులుగా కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 26 (భద్రాద్రి న్యూస్) : కార్మిక హక్కుల సాధనకు, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జాతీయ మహాసభల స్ఫూర్తితో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని ఏఐటీయూసీ జాతీయ సమితి నూతన సభ్యులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు నగరంలో ఐదు రోజుల పాటు జరిగిన ఏఐటీయూసీ జాతీయ మహాసభలు గురువారం ముగిశాయి. ఈ మహాసభల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కంచర్ల జమలయ్య జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నికవగా, జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ రెండోసారి జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ మహాసభలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో విజయవంతమయ్యాయని, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం కీలక తీర్మానాలు చేశామని తెలిపారు. తమ ఎంపికకు సహకరించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు, జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. వీరి ఎన్నిక పట్ల జిల్లాలోని ఏఐటీయూసీ అనుబంధ సంఘటిత, అసంఘటిత కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

